www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 సంచిక : 32 06-05-2024 పుటలు : 4

## నన్నయలో ఎంఎస్సీ జియో ఇన్ఫర్మేటిక్స్ కోర్సు ప్రారంభం



**02.05.24 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం ప్రాంగణంలో ఎంఎస్సీ జియోఇన్ఫర్మేటిక్స్ కోర్సును ప్రారంభిస్తున్నామని, ఏపీ పీజీ సెట్ ద్వారా విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చునని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. గురువారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలు తెలియజేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా ఎంఎస్సీ జియోఇన్ఫర్మేటిక్స్ నూతన కోర్సును అందిస్తున్నామని, ఏదైనా రెండు సబ్జెక్టులతో ఏదైనా సైన్స్ గ్రాడ్యుయేట్లు: (అనగా, కంప్యూటర్ సైన్సెస్, జియాలజీ, జియోగ్రఫీ, లైఫ్ సైన్సెస్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్, ఫోరెన్సిక్ సైన్స్, ఫారెస్ట్రీ, అగ్రికల్చర్ సైన్సెస్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ మరియు ఎలక్ట్రానిక్స్) చేసిన విద్యార్థులంతా ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఏపీ పీజీ సెట్ ద్వారా విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చునని, మే 4వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌లు లభిస్తాయని అన్నారు. జియోఇన్ఫర్మేటిక్స్ చేసిన విద్యార్థులకు పరిశోధనల్లోను, ఉద్యోగ, ఉపాధిలోను అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇస్రో, ఎన్.ఆర్.ఎస్.సి, ఎన్.బి.ఎస్.ఎస్., ఎస్.ఎస్.డి.ఐ., ఎఫ్.ఎస్.ఐ., జి.ఎస్.ఐ., డి.ఆర్.డి.ఓ., ఎన్.ఐ.ఆర్.డి. వంటి ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. అలాగే యాక్సెంచర్, భారతి ఎయిర్‌టెల్, కాగ్నిజెంట్ టెక్నాలజీ, సైయెంట్, జెనెసిస్ ఇంటర్నేషనల్, గూగుల్, ఇన్ఫోసిస్ బిపిఎం, టిసిఎస్, టెక్ మహీంద్రా, ట్రింబుల్ మ్యాప్‌లు, విప్రో వంటి పారిశ్రామిక సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఏపీ పీజీ సెట్ ద్వారా ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంఎస్సీ జియోఇన్ఫర్మేటిక్స్ కోర్సులో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, విభాగాధిపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మరియు విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

## ఉపకులపతి ఉవాచ



### ఓటు వేయండి!

ప్రజాస్వామ్యం ద్వారా మనకు లభించిన శక్తివంతమైన హక్కు – ఓటు! "ప్రజల కోసం, ప్రజల చేత" అనే ప్రజాస్వామ్య నినాదానికి ఓటింగ్ మూలస్తంభం. దేశ నిర్మాణ ప్రక్రియలో, మార్పులో నిజంగా పాల్గొనాలనుకుంటే తప్పనిసరిగా మనం ఓటు వేయాలి.రాజ్యాంగం మనకు కల్పించిన గొప్ప హక్కు ఓటు. "రూల్ ఆఫ్ లా" అనే పునాది మీద నిర్మించబడింది మన ప్రజాస్వామ్యం. ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేస్తూ నియంతృత్వాన్ని నిరోధిస్తుంది. చట్టబద్ధమైన పాలనను కొనసాగించటానికి ఇది చాలా అవసరం. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ కీలకమైంది. రెండు అక్షరాల "ఓటు" అనే పదం దేశ చరిత్రనే మార్చేస్తుంది. కాబట్టి...

**రాక్ ద ఓట్!**

ఆచార్య కె.పద్మరాజు

## ఐసిఎఆర్ - కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ

# వ్యవస్థాపక దినోత్సవం



రాజమహేంద్రవరం ఐసిఎఆర్ – కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సి.టి.ఆర్.ఐ.) 77వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గత 76 సంవత్సరాలుగా పొగాకు సాగులో అత్యుత్తమ పరిశోధనలు జరిపి, అధిక దిగుబడినిచ్చే మేలైన పొగాకు వంగడాలు రూపొందించి, రైతుల సాంఘిక మరియు ఆర్థిక అభివృద్ధికి గణనీయమైన కృషి చేస్తున్న సంస్థ జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో పొగాకు పరిశోధన రంగంలో విశేష ఖ్యాతిని గడించింది. ఈ కార్యక్రమానికి సి.టి.ఆర్.ఐ. డైరెక్టర్ డా.ఎం.శేషు మాధవ్ అధ్యక్షత వహించగా, ఐసిఎఆర్ పూర్వపు డైరెక్టర్ జనరల్ మరియు పి.పి.వి.ఎఫ్.ఆర్.ఎ చైర్ పర్సన్ డా.త్రిలోచన్ మొహాపాత్ర ముఖ్య అతిథి గాను, డా. ఆర్.సి. అగర్వాల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఎడ్యుకేషన్), విశిష్ట అతిథి గాను పాల్గొన్నారు. 1947లో ప్రారంభించినప్పటి నుండి సంస్థ సుదీర్ఘ పరిశోధనా ప్రయాణాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహాపాత్ర మాట్లాడుతూ సంస్థ రైతులకు మరింత లాభదాయకమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని, తద్వారా దేశానికి, రైతులకు సంపద సృష్టించాలని పేర్కొన్నారు. పొగాకు పరిశోధనలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు అవిశ్రాంత కృషితో రేపటి భారతదేశాన్ని సంపదతో నిర్మించగలమని ఆయన ఉద్ఘాటించారు. భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి, వివిధ పంటలు మరియు ఉత్పత్తులలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఐ.సి.ఎ.ఆర్. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఎడ్యుకేషన్) డాక్టర్ ఆర్.సి. అగర్వాల్ మాట్లాడుతూ వ్యవసాయంలో గ్రాడ్యుయేట్ కోర్సులను ఎక్కువ సంఖ్యలో మహిళలు ఎంచుకుంటున్నారని, మహిళాభివృధికి ఇది నాంది అని తెలిపారు. 2030 నాటికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు స్వయం సమృద్ధిగా మారాలని, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు మరియు ఐసిఎఆర్ సంస్థలు ఇతర సంస్థలతో కలిసి పరిశోధన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఐసిఎఆర్ – సిటిఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్ తన అధ్యక్ష ప్రసంగంలో 76 సంవత్సరాల పొగాకు పరిశోధన మరియు ప్రగతిని పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సంస్థ పొగాకు ఉత్పాదకతను పెంపొందించడంలో మరియు రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించి, లక్షలాది మంది రైతులు మరియు కార్మికులు ఈ పంటపై ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. పొగాకులోని హానికరమైన పదార్థాలైన నికోటిన్, తారు మరియు నైట్రోసమైన్‌లను తగ్గించడంలో పరిశోధనల జరుపుతున్నామని తెలియచేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సిటిఆర్ఐ సంస్థతో పరిశోధనలలో పరస్పర ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ సాగులో మరిన్ని మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. ఆచార్య ఎన్ జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఆర్.శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ తమ విద్యార్థులకు సిటిఆర్ఐ శాస్త్రవేత్తలు సలహాలు మరియు సహకారాన్ని అందిస్తున్నారని తెలిపారు. డాక్టర్‌వైఎస్‌ఆర్‌హెచ్‌యూ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి.జానకిరామ్ మాట్లాడుతూ మిర్చి, పసుపులో సీటీఆర్ఐ సహకారంతో పని చేసేందుకు డాక్టర్‌వైఎస్‌ఆర్‌హెచ్‌యూ సిద్ధంగా ఉందన్నారు.



# సంపాదకీయం




## ఓటు!

మార్పుకీ తీర్పుకీ ఒకటేదారి - ఓటు! ఓటెవరికేయటం అనేది మీఇష్టం. మీరు ఓటేసిన వ్యక్తి గెలవచ్చు.గెలవకపోవచ్చు.కానీ ఓటెయ్యాలి.ఓటు గెలిపించటానికే కాదు ఓడించటానికి కూడా. ఎందుకంటే ఓటు ఆయుధం - వ్యవస్థను మారుస్తుంది. ఓటు ఆగ్రహం - అవస్థలను పోగొడుతుంది. ఓటు వ్యక్తీకరణ - మనకేం కావాలో చెప్పొచ్చు. ఓటు బాధ్యత - ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుంది.

"గజానికొక గాంధారీ కొడుకు గాంధీ గారి దేశంలో!" అన్నారు తిలక్. నోటుకో,మద్యం సీసాకో, బహుమతికో ఓటుని అమ్ముకుంటే దుశ్శాసనులు చట్టసభల్లో అడుగు పెడతారు. జనామోదం లేనివాళ్లు, జనానికి మంచి చేయాలనే ఆలోచన లేనివాళ్ళు చట్టసభల్లోకి వెళ్తే ఏంజరుగుతుందో దేశంనిండా బోలెడన్ని ఉదాహరణలున్నాయి. కలుపు మొక్కల్ని ఏరకపోతే అసలు పంటకే ఎసరపెట్టి పొలమంతా విస్తరిస్తుంది.ఎన్నికలు జరిగేది అందుకే.

ఎవరు గెలిస్తే ఏంటనకండి. తమదాకా వస్తేకానీ ఎవరికేమి తెలీదు. ఎన్నికలు, ప్రజాజీవితం వేరుకాదు.ఓటెయ్యకుండా కులాసాగా కూర్చుంటే జరగాల్సిన అనర్ధాలు జరిగిపోతాయి. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పర్యవసానం తర్వాత తెలుస్తుంది.

ఓటు వేయకపోతే నిలదీసే హక్కు, విమర్శించే హక్కు, ఫిర్యాదు చేసే హక్కు కోల్పోయినట్లే. ఐదు నిమిషాల బద్దకం ఐదేళ్లపాటు వెంటాడుతుంది. ఓటేయటమంటే గెలుపు ఓటములే కాదు,వ్యవస్థలో మనం పాలుపంచుకోవటమని కూడా అర్థం. ప్రజాస్వామ్యంలో అద్భుతం ఏంటంటే మీరు ఎన్నుకునే వ్యక్తి మంత్రి కావచ్చు, తిరస్కరించే వ్యక్తి ఎంత యోధుడైనా తలవంచుకుని తిరుగుముఖం పట్టొచ్చు.

"ప్రపంచంలో ఏ పదవీ ఓటరు బాధ్యత కంటే గొప్పది కాదంటారు" ఫ్రాంక్ ఫర్టర్ అనే పెద్దమనిషి. మామూలు విషయాలన్నీ తర్వాత మాట్లాడుకుందామండి! ఓటేద్దాం!లెగండి. రండి!!

## బీఈడీ మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించిన వీసీ



ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని బీఈడీ మూడవ సెమిస్టర్ పరీక్ష పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు పరిశీలించారు. విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ మూడవ సెమిస్టర్ కు చెందిన 7949 పరీక్ష పత్రాలను మూల్యాంకనం చేస్తున్నారు. వీసీ పద్మరాజు వాటిని పరిశీలించి పలు సూచనలు అందించారు. విద్యార్థులందరినీ దృష్టిలో ఉంచుకొని క్రమమైన విధానంలో మూల్యాంకనం చేయాలని సూచించారు. బీఈడీ స్పాట్ చీఫ్ డా.కె.సుబ్బారావు మాట్లాడుతూ అనుబంధ కళాశాలలకు చెందిన అనుభవంగల 60 మంది అధ్యాపకులుచే మూల్యాంకన చేస్తున్నామన్నారు. మే 2వ తేదీ నుండి మూడు రోజుల పాటు పరీక్ష పత్రాల మూల్యాంకనం చేపట్టామన్నారు.

## నింబస్ (Knimbus) ఆన్లైన్ రిసోర్సెస్ ప్లాట్ ఫారం ఆవిష్కరణ




ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయ ఆధ్వర్యంలో నింబస్ (ఎలక్ట్రానిక్ రిసోర్సెస్) ప్లాంట్ ఫార్మ్ లైబ్రరీ కోఆర్డినేటర్ డా.పి.విజయ నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు బ్రోచర్ ను ఆవిష్కరించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నింబస్ ఉపయోగాలను వివరించారు. నింబస్ అనేది క్లౌడ్-ఆధారిత డిజిటల్ లైబ్రరీ ప్లాట్‌ఫారమ్, ఇది ఇ-రిసోర్సెస్, ఓ.పి.ఎ.సి. మరియు ఐ.ఆర్. లను ఏకీకృత ప్రదేశంగా ఏకీకృతం చేస్తుంది. ఎప్పుడైనా, ఎక్కడ నుండి అయిన అవసమైన సమాచారం అందుకోడానికి అనుకూలంగా ఉంటుంది. నింబస్ ద్వారా సుమారు రెండు లక్షలకు పైగా ఎ-జర్నల్స్, బుక్స్, వీడియోలు అందుబాటులో లభిస్తాయి. నింబస్ ద్వారా కాటలాగ్ యాక్సెస్ 2,00,000 క్యూరేటెడ్ జర్నల్‌లు, ఈబుక్‌లు, వీడియోలు, కోర్సులు, కేస్ స్టడీస్ మరియు సాహిత్యం, ఇంజనీరింగ్, మెడికల్ సైన్సెస్, సోషియాలజీ మరియు మరెన్నో విస్తరించి ఉన్న డేటాసెట్‌లను యాక్సెస్ చేసుకోవచ్చు ఈ సౌకర్యాన్ని మొబైల్ అప్లికేషన్ కుడా విద్యార్థులు , ఉపాధ్యాయులు వినియోగించుకోవచ్చునని ఆచార్య పద్మరాజు తెలియజేశారు, ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపల్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, డా.పి.వెంకటేశ్వరరావు, ఆచార్య కే.సుబ్బారావు, డీన్స్ ఆచార్య సురేష్ వర్మ, ఆచార్య కే.శ్రీరమేష్, ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య కే.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, ఆచార్య కె.వి.స్వామి, లైబ్రరీ కోఆర్డినేటర్ డా.పి.విజయ నిర్మల, సహాయ గ్రంథాలయాధికారి డా.టి.సింహాచలం పాల్గొన్నారు.

## మంచిమాట

"భారతదేశ ప్రజలు ఓటు విలువ తెలుసుకొని రాజ్యాధికారం సాధించిన రోజు రాజ్యాంగం గొప్పదనం అవగతమవుతుంది."



- రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్



## ఉమెన్స్ హాస్టల్ భవనాన్ని పరిశీలించిన వీసీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ లోని డా.బి.ఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వెనుక నూతనంగా నిర్మిస్తున్న ఉమెన్స్ హాస్టల్ భవనాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు పరిశీలించారు. ప్రస్తుతం భవనం మొదటి అంతస్తు స్లాబ్ వేస్తున్నారు. భవన నిర్మాణ నాణ్యతను వీసీ పరిశీలించి వివరాలు తెలియజేశారు. విశ్వవిద్యాలయంలోని మహిళా విద్యార్థుల కోసం నూతన ఉమెన్స్ హాస్టల్ ను రూ. 17.35 కోట్లు తో నిర్మిస్తున్నామని చెప్పారు. సుమారు 500 మంది విద్యార్థులకు సరిపడే విధంగా జి ప్లస్ త్రీ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ఉమెన్స్ హాస్టల్ భవనాన్ని విద్యార్థులకు అందించే విధంగా ప్రత్యేక శ్రద్ధ చూపాలని యూనివర్సిటీ ఇంజనీర్లకు సూచించారు.

## కాకినాడ క్యాంపస్‌లో ఫుడ్ ఫెస్టివల్



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం. ఎస్. ఎన్ క్యాంపస్ కాకినాడ నందు క్యాంపస్ లోని విద్యార్థులచే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే అనేక ఫుడ్ స్టాల్స్ సంప్రదాయ, ఆరోగ్య ప్రధానమైన మరియు ఫాస్ట్ ఫుడ్ వంటలకు సంబంధించిన ఏర్పాటు చేసి వాటిని విక్రయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వంటశాల భారత వంటశాస్త్రంలో కనుమరుగైన వివిధ పనిముట్లు విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఈ యొక్క ఫుడ్ ఫెస్టివల్ మంచి రుచులతో ఆరోగ్యం చేకూర్చే , సాంప్రదాయం ఉట్టి పడేలాగా వివిధ ఆహారపదార్థాలను మరియు పండ్ల రసాలను హర్షదాయకమని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. స్టీఫెన్ , వరప్రసాద్, మహమ్మద్ నదీమ్, శ్రీమతి రాధా మాధవి, డా. శ్రీదేవి, శ్రీమతి జ్యోతి కిరణ్, డా. ఎస్తేరురాణి అధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్‌తో డిజిటల్ విద్యా భాగస్వామ్యం



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్‌పై తన ఛానెల్‌ను ప్రారంభించి, డిజిటల్ విద్యాభ్యాసం వైపు ఒక గణనీయమైన అడుగు వేసింది. ఉపకులపతి ప్రొ. కె. పద్మరాజు నాయకత్వంలో మే 3న ఆన్లైన్లో దీనిని ప్రారంభించారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్‌తో అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ ప్రయత్నం, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ. జి. సుధాకర్, ప్రిన్సిపాల్స్, డీన్స్, ఫ్యాకల్టీ, మరియు అనుబంధ కాలేజీల నుండి ఎస్.పి.ఓ.సి. లు చేరిన ఒక వర్చువల్ వేడుకలో జరుపుకుంది. ఈ భాగస్వామ్యం విద్యార్థులకు ఆధునిక డిజిటల్ విద్యా పరికరాలు మరియు కోర్సులను అందించడానికి ఉపయోగపడుతుంది.

## కోకో ప్రాసెసింగ్ యూనిట్‌ను విజిట్ చేసిన నన్నయ విద్యార్థులు




ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లోని ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, ఆక్వాకల్చర్, జువాలజీ కోర్సులకు చెందిన విద్యార్థులు కోకో ప్రాసెసింగ్ యూనిట్ ను విజిట్ చేశారు. ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ ఆచార్య పి.రామకృష్ణ ఆధ్వర్యంలో రావులపాలెంలోని రమ్య ఫుడ్స్ ఎల్.ఎల్.పి కోకో ప్రాసెసింగ్ యూనిట్ ను సందర్శించారు. ఈ విజిట్ కోకో బీన్స్ ఉత్పత్తులకు సంబంధించి వివిధ అంశాలను విధానాలను విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డా.ఎస్ మురళీమోహన్, ఎం.లక్ష్మీ లావణ్య, ఎం.ఎం. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్

**(మే 7 జయంతి)**

## ప్రతిభావాణి



భారత దేశానికి మొట్టమొదటి నోబెల్ బహుమతి అందించిన వ్యక్తి, విశ్వకవి,గురుదేవుడు అని ప్రసిద్ధి చెందిన వ్యక్తి రవీంద్రనాథ్ ఠాగూర్. ఈయన 1861 మే 7 వ తేదీన దేవేంద్రనాథ ఠాగూర్, శారదాదేవీలకు 14 వ సంతానంగా జన్మించాడు. నిద్ర లేవగానే ఇంటి తోటలోకి పోయి ప్రకృతి సౌందర్యాన్ని చూచి ఆనందించే వాడు. కథలంటే చెవి కోసుకొనేవాడు. సామాన్య దుస్తులతో, నిరాడంబరంగా పెరిగాడు.

బాల్యంలో ఇంట్లోనే నాలుగు గోడల మధ్య ఉండవలసి రావటంతో ఆయనకు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. ప్రపంచమొక రహస్యమనీ, ఆ రహస్యాన్ని తెలుసుకోవాలని ఆరాటపడేవాడు. ఠాకూర్ బెంగాలీలో రచించిన భక్తి 'గీతాంజలి' ఆంగ్లంలోకి అనువాదించబడింది. ఆ తర్వాత అది అనేక భాషల్లోకి తర్జుమా చేయడంతో.. రవింద్రుడి పేరు ఎల్లలు దాటింది. 1913 సంవత్సరంలో సాహిత్యంలో ఆయనకు నోబెల్ బహుమతి లభించింది. విశ్వకవి అనే బిరుదును సాధించి పెట్టింది. నోబెల్ పొందిన తొలి భారతీయుడిగానే కాదు, ఆసియాలోనే తొలి వ్యక్తిగా ఆయన రికార్డులకు ఎక్కారు. ఠాగూర్ అనేక ఇతర ముఖ్యమైన రచనల్లో మానసి (1890), సోనార్ తారి (1894), గితిమాలయ (1914), రాజా (1910), పోస్టాఫీసు (1912), తోటమాలి (1913),ముక్తధార (1922),చండాలిక (1939) మొదలైనవి ఉన్నాయి.

రవీంద్రనాథ్ ఠాగూర్ ఎన్నో చిత్రాలను గీశారు.

జాతీయ స్వాతంత్ర్యోద్యంలో రవీంద్ర నాథ్ ఠాగూర్ బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. జలియన్ వాలాబాగ్ మారణకాండకు నిరసనగా అతడికి బ్రిటీష్ అధికారులు ఇచ్చిన 'నైట్‌హుడ్' బిరుదును కూడా తిరిగి ఇచ్చేశారు. జాతీయ భావాలు అధికంగా ఉన్న రవీంద్రుడు అనేక హిందూ మేళాలో దేశ భక్తి గీతాలను పాడేవారు. తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తట్టిలేపేవారు. బ్రిటిష్ వాళ్ళు బాల గంగాధర్ తిలక్ ను బంధించినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించారు. బ్రిటీష్ ప్రభుత్వాన్ని విమర్శించారు. బెంగాల్ విభజనను వ్యతిరేకించారు.

మనం జాతీయ గీతంగా పిలుచుకునే 'జనగణమణ'ను ఆయనే రచించారు. 'వందేమాతరం' గేయాన్ని 1896లో జరిగిన కాంగ్రెస్ సదస్సులో తొలిసారిగా ఆలపించారు. 1950 సంవత్సరం జనవరి 24వ తేదీన 'జనగణమణ' ను జాతీయ గీతంగా ప్రకటించారు.

ఠాగూర్ స్వరకల్పనలు రెండు దేశాల జాతీయ గీతాలుగా మారాయి. 'జన గణ మన' భారత జాతీయ గీతం కాగా, మరోవైపు బంగ్లాదేశ్ జాతీయ గీతం 'అమర్ సోనార్ బంగ్లా' కూడా ఆయన స్వరకల్పన చేసిందే. శ్రీలంక జాతీయ గీతం 'శ్రీలంక మాత' కూడా ఠాగూర్ సృష్టి నుండి ప్రేరణ పొందింది. శ్రీలంక మతాన్ని రచించిన ఆనంద్ సమర్కూన్ రవీంద్రనాథ్ ఠాగూర్‌తో శాంతినికేతన్‌లో నివసించారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ అనేక దేశాలు సందర్శించి 'విశ్వంలోని మానవులంతా ఒక్కటే' అనే సందేశాన్ని అందించారు. తాను నమ్మిన బ్రహ్మ సమాజ సిద్ధాంతాల ద్వారా మతాలకు అతీతమైన పరబ్రహ్మమొక్కటే అందరికీ దైవం అని ప్రచారం చేసి 'విశ్వకవి', 'గురుదేవ్' బిరుదులను శాశ్వతం చేసుకున్నారు. ప్రపంచ పర్యటనలో 35కు పైగా దేశాలలో భారతదేశం యొక్క ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. విశ్వకవి రవీంద్రుడి జీవితం ఒక విజ్ఞాన సర్వస్వం.

\- బి.సుశాంత్ కుమార్


# రక్తదానంతో తలసేమియా చిన్నారులకు భరోసా!

## (మే 8 తలసేమియా దినోత్సవం)



వైద్య రంగంలో అధునాతనమైన సాంకేతిక పద్ధతులతో ప్రపంచం ముందుకు దూసుకు పోతున్నప్పటికీ నేటికీ కొన్ని అంతుచిక్కని రోగాలు, పూర్తి వైద్యం అమలులో లేని వ్యాధులు ఉన్నాయి. అటువంటి వ్యాధులలో తలసేమియా అనేది ఒకానొకటి. తలసేమియా అనేది చిన్నారులలో పుట్టుకతో వచ్చే అతి భయంకరమైన జన్యపరమైన వ్యాధి. శరీరంలో ఎర్రరక్త కణాల ఉత్పత్తి లోపం కారణంగా ఈ వ్యాధి బారిన పడిన చిన్నారులకు ప్రతి మూడు నుండి నాలుగు వారాలకు ఒకసారి రక్తం ఎక్కించాలి. ఆనందంగా ఆడుకోవాల్సిన బాల్యంలో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ దిన దిన గండంగా కాలం గడిపే చిన్నారుల పరిస్థితి ఎంతో దయనీయమైనది. ప్రతీ నెల రక్తదాతల వెతుకులాటలో ఈ చిన్నారుల తల్లిదండ్రులు పడే బాధ వర్ణనాతీతం. సకాలంలో రక్తం దొరకకపోతే మరణమే శరణ్యం, ఇక రక్తం దొరికినప్పటికీ నిరంతర రక్తమార్పిడి కారణంగా శరీరంలోని మార్పులు కారణంగా తీవ్ర సమస్యలు తలెత్తుతాయి. ఈ రక్త రుగ్మత వ్యాధి అయిన తలసేమియా నుండి పూర్తి విముక్తి కొరకు ఎముక మజ్జ మార్పిడి శస్త్రచికిత్స ఉన్నప్పటికీ, వ్యాధి బారిన పడిన చిన్నారికి సరిపోలిన ఎముక మజ్జ దాత దొరకడం కష్టసాధ్యం అయినప్పటికీ ఇది లక్షలతో కూడుకున్నది మరియు సఫలం అయ్యే అవకాశాలు చాలా చాలా తక్కువ. తలసేమియా వ్యాధి చిన్నారులలో ఎదుగుదల లేకపోవడం, తీవ్ర రక్తహీనత, అలసట, నీరసం, చర్మం పాలిపోవడం, రోగనిరోధక శక్తి లోపించి తరచూ ఇన్ఫెక్షన్లు రావడం వంటివి సాధారణంగా కనిపించే లక్షణాలు.

రక్తం ఎక్కించడం ద్వారా శరీరంలో పెరిగే ఐరన్ నిల్వలను క్రమబద్ధీకరించుటకు ఐరన్ చెలేషన్ థెరపీ, ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంపొందించే విధంగా ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్స్ ఉపయోగించడం ఇదంతా భారీ ఖర్చుతో కూడుకున్నది. వికలాంగుల హక్కుల చట్టం - 2016 ద్వారా తలసేమియా, హీమోఫిలియా మరియు సికిల్ సెల్ అనీమియా వ్యాధి వంటి రక్త సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్న వ్యక్తులను వికలాంగులుగా గుర్తించి ప్రతినెల పెన్షన్ ఇవ్వడం ద్వారా కొంతమేరకు ఆర్థిక భరోసా చేకూరినప్పటికీ రక్త కొరతతో ఇబ్బంది పడి సమయానికి రక్తం దొరకక అనేక సమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. తలసేమియా వ్యాధిపై అవగాహన పెంపొందించుట కొరకు తలసేమియా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ 1994 నుండి ప్రతి సంవత్సరం మే 8వ తేదీన అంతర్జాతీయ తలసేమియా దినోత్సవం చేయాలని నిర్ణయించింది. రక్తదానంపై విశిష్ట సేవలు అందిస్తూ శాంతికి మారుపేరుగా నిలుస్తూ నాలుగు సార్లు నోబెల్ శాంతి బహుమతిని సాధించిన అతిపెద్ద మానవతా సంస్థ రెడ్ క్రాస్ సొసైటీ స్థాపకులు హెన్రీ డ్యూనాంట్ జన్మదినోత్సవం అయిన వరల్డ్ రెడ్ క్రాస్ డే కూడా మే 8వ తేదీ ఉండడం గమనార్హం.




వంశపార్యపరంగా వచ్చే ఈ వ్యాధి భవిష్యత్తు తరాలకు వ్యాపించకుండా వివాహానికి ముందు హెచ్ బిఏ2 పరీక్ష చేయించుకోవడం ఎంతో ఆవశ్యకమైనది.

**రక్తదాత సుఖీభవ!**

ఆపద సమయంలో ఒక తల్లి కన్నీళ్లు తన బిడ్డను రక్షించలేవు కానీ మన రక్తం ఆ పని చేయగలదు. దేవుళ్ళు భావించే డాక్టర్లు సైతం కొన్ని సందర్భాలలో రోగిని బతికించుటకు ఇంకొక గొప్ప వ్యక్తి సహాయం కోరతారు, ఆ మహాత్ముడే రక్తదాత. రక్తదానం అంతటి గొప్పది ఎందుకంటే మనం దానం చేసే ఒక్క యూనిట్ రక్తం ఎర్ర రక్తకణాలు, రక్తఫలకికలు, ప్లాస్మా విభజించడం ద్వారా ఒకేసారి ముగ్గురు ప్రాణాలను రక్షించవచ్చు. నేను ఒక్కసారి చేసే రక్తదానం విలువ మరో 3 గుండెల చప్పుడు అని తెలిసిన నా రక్తం ఉవ్వెత్తున ఎగసిపడే కెరటంలా రక్తదానం చెయ్ అంటూ ఉరకలు వేస్తుంది. తలసేమియా చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, ప్రమాద బాధితులు ఇలా భారతదేశమంతటా ప్రతి రెండు సెకండ్లకు ఒక రక్తం అవసరం అవుతుంది. రక్తదానం చేసేటప్పుడు నేషనల్ బ్లడ్ ట్రాన్స్ఫ్యూజన్ కౌన్సిల్ నియమ నిబంధన అనుసరించి నిపుణులైన వైద్య సిబ్బంది పర్యవేక్షణలో రక్తదాతలను పరీక్షించిన తర్వాతే రక్తం తీస్తారు. సగటున 50 కేజీల బరువు, 12.5 గ్రాముల హీమోగ్లోబిన్ కలిగి ఆరోగ్యంగా ఉన్న18 నుంచి 60 సంవత్సరాల లోపు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయ్యొచ్చు. పురుషులు ప్రతి మూడు నెలలకు మరియు మహిళలు ప్రతి నాలుగు నెలలకు నిస్సంకోచంగా రక్తదానం చేయవచ్చు.రక్తదానం తర్వాత ఎటువంటి బలహీనత సంభవించదు. 15 నిమిషాలు విశ్రాంతి తీసుకుని, ఒక రోజు ద్రవ పదార్థాలు విరివిగా తీసుకుంటే చాలు, ఎప్పటిలా ఆరోగ్యంగా ఇంకా ఉత్సాహంగా ఉంటారు. అదేవిధంగా రక్తదానంతో బిపి, హిమోగ్లోబిన్, హెచ్ఐవి, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, సిఫ్లిస్, ఎం.పి వంటి పరీక్షలు చేయడం వలన ఉచితంగా ఆరోగ్య తనిఖీ చేయించుకోవడంతో పాటు రక్తదాత శరీరానికి కూడా ఆరోగ్యకరమైన ప్రయోజనాలు చేకూరుతాయి. సురక్షితమైన నిరంతర రక్తదానం వల్ల శరీరంలోని అధికమైన ఐరన్ నిల్వలు క్రమబద్ధీకరించబడి గుండెపోటు, క్యాన్సర్ వంటి ప్రమాదాలు వచ్చే ముప్పు తగ్గుతుంది. రక్తదానం వలన నూతన ఉత్తేజంతో ఎర్ర రక్తకణాలు, తెల్లరక్త కణాలు పునరుత్పత్తి జరిగి రోగనిరోధక శక్తి పెరుగుతుంది. కనుక అపోహలు వీడి ధైర్యంగా ముందడుగు వేసి ఎల్లప్పుడు రక్తదానానికి సంసిద్ధులై ఉండాలి. వివేకానందుడు పేర్కొన్న ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం కలిగిన యువత అందరూ చైతన్యంతో ముందుకు వచ్చి పిడికిలి బిగించి స్వచ్ఛంద రక్తదానం చేస్తూ ఆరోగ్యవంతమైన నవభారతాన్ని నిర్మించుకుందాం. తల్లి జన్మనిస్తే రక్తదాత పునర్జన్మణిస్తాడు.

- పాగోటి రాంబాబు

(బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ - విశాఖపట్నం డిస్ట్రిక్ట్ బ్రాంచ్)
ఎమ్.ఎ. సోషల్ వర్క్( పూర్వ విద్యార్థి), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

# ఓటరన్నా! మేలుకో!



ఓటు హక్కును వినియోగించుకో..
ఓటు పాశుపతాస్త్రమని తెలుసుకో
అభివృద్ధినే అందలం ఎక్కించుకో
ఓటుకు నోటు అంటారు కొందరు..
బంగారం ఇస్తామంటారు కొందరు..
మందే ముద్దంటారు ఇంకొందరు..
అధికారమిస్తే అన్ని చేస్తామంటారు.
తీరా ఇచ్చాక ముఖం చాటేస్తారు.
అభివృద్ధికి ఆమడ దూరముంటారు
అందుకే ఓటరన్న జాగ్రత్తగా మసలుకో....

ఎన్నికలు వచ్చినప్పుడే
ఓటరన్న చుట్టూ ప్రదక్షిణాలు
ఆచరణ సాధ్యం కానీ హామీలిస్తారు
ఓటు కోసం ఎంతకైనా దిగజారుతారు
ఆయువు పట్టి,గురిపెట్టి ఓటును నొక్కు
ఓటుతోనే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకో
నీ ఓటుతోనే మారుతాయి తలరాతలు
ప్రగతికి వేసుకో పూల బాటలు

- బి.సుశాంత్ కుమార్

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in